క్లుప్తంగా

ఆర్థికసాయం



మోహన్‌రెడ్డికి ఆర్థిక సాయం చేస్తున్న కువైట్ రెడ్డీస్ అసోసియేషన్ సభ్యులు

కడప కార్పొరేషన్: జిల్లాలోని పెండ్లిమర్రి మండలం యార్లపాడుగ్రామంలో పక్షవాతంతో బాధపడుతున్న ఎర్రంరెడ్డి మోహన్‌రెడ్డికి కువైట్ రెడ్డీస్ అసోసియేషన్ తరుపున రూ.50వేలు ఆర్థిక సాయం చేశారు. సోమవారం కువైట్ రెడ్డీస్ సంఘం అధ్యక్షులు నాయని మహేశ్వర్‌రెడ్డి, మాజీ అధ్యక్షులు మన్నూర్ చంద్రశేఖర్‌రెడ్డి, వీపీ రామచంద్రారెడ్డి, ఉపాధ్యక్షులు అరవ సుబ్బారెడ్డి, పల్లె సుబ్బరామిరెడ్డిలు ఆయన్ను పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. ఈ సందర్భంగా గల్ఫ్ కన్వీనర్ బీహెచ్ ఇలియాస్ మాట్లాడుతూ కువైట్‌కు ఉపాధి కోసం వెళ్లిన కొంత మంది కువైట్ రెడ్డీస్ సంఘంగా ఏర్పడి చేస్తున్న సామజిక సేవలు అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో వై. రవిచంద్రారెడ్డి, పి . రెహమాన్ ఖాన్, సుండుపల్లె జడ్పీటీసీ షేక్ ఇస్మాయిల్ పాల్గొన్నారు.

బీసీలకు రిజర్వేషన్లు కల్పించాలి

కడప సెవెన్‌రోడ్స్ : రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని బహుజన సమాజ్ పార్టీ జిల్లా అధ్యక్షులు సగిలి గుర్రప్ప కోరారు. సోమవారం జాయింట్ కలెక్టర్ అదితిసింగ్‌కు వినతిపత్రాన్ని సమర్పించారు. అన్ని రాజకీయ పార్టీలు బీసీలను ఓటు బ్యాంకుగా మార్చుకుని మోసం చేశాయన్నారు. బీసీలకు రాజ్యాధికారం బహుజన సమాజ్ పార్టీ ద్వారానే సాధ్యమన్నారు. రాష్ట్రంలోని బీసీలంతా ఏకతాటిపైకి వచ్చి మాయావతిని ప్రధానిగా చేసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు బాలచంద్ర, చంద్ర, ఎస్.బేబి, రెడ్డెయ్య, వినోద్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చీరెల పంపిణీ



పేదలకు చీరలు పంపిణీ చేస్తున్న సురేష్‌బాబు

కడప కోటిరెడ్డిసర్కిల్ : కడప నగరానికి చెందిన జ్యోతిష్యశాస్త్ర నిపుణులు సురేష్‌బాబు కుమార్తె సుహితా షారోన్ 17వ జన్మదినాన్ని పురస్కరించుకుని పేద మహిళలకు చీరెలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు మాట్లాడుతూ పేద వర్గాలను ఆదుకునేందుకు ప్రతి ఒక్కరూ ముందుకు రావాలన్నారు. ఈ కార్యక్రమంలో నిర్మలాదేవి, సుందర్‌రావు, సుజాత, జాన్, బుజ్జి, కుసుమ, స్నేహిత, రూప తదితరులు పాల్గొన్నారు.

22న పుస్తకావిష్కరణ

కడప ఎడ్యుకేషన్: జీఎల్ లావణ్య రచించిన ‘కమనీయ కవితలు’ అనే పుస్తకాన్ని వైయస్సార్ కడప జిల్లా రచయితల సంఘం ఆధ్వర్యంలో ఈనెల 22వ తేదీ సాయంత్రం 4 గంటలకు కడప సిపి బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో ఆవిష్కరిస్తున్నట్లు రచయితల సంఘం అధ్యక్షులు ఆచార్య మూల మల్లికార్జున రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విశ్రాంత జిల్లా సెషెన్స్ న్యాయమూర్తి షేక్ మొహమ్మద్ ఇస్మాయిల్ పాల్గొంటారన్నారు.

అధిక ధరకు అమ్మితే చర్యలు



ఎరువుల దుకాణంలో తనిఖీ చేస్తున్న వ్యవసాయ అధికారి సురేష్ కుమార్‌రెడ్డి

కడప అగ్రికల్చర్: ఎరువులను ఎమ్మార్పీ ధరల కంటే అధికరేట్లకు అమ్మితే చర్యలు తప్పవని కడప మండల వ్యవసాయ అధికారి సురేష్‌కుమార్‌రెడ్డి పేర్కొన్నారు. సోమవారం కడప పట్టణంలోని పలు ఎరువుల దుకాణాలను ఆయన తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎరువుల స్టాక్ రిజిష్టర్, ఎరువుల నిల్వలను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎరువుల దుకాణదారులు తప్పనిసరిగా స్టాక్ రిజిష్టర్, స్టాక్ బోర్డు, ఎరువుల ధరల బోర్డును షాప్‌లో ఏర్పాటు చేసుకోవాలని తెలిపారు. యూరియాను ఎమ్మార్పీ ధర కంటే ఎక్కువ అమ్మ రాదని సూచించారు.

డ్రగ్స్ రహిత సమాజం కోసం కృషి

చింతకొమ్మదిన్నె : డ్రగ్స్ రహిత సమాజం కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని చింతకొమ్మదిన్నె జెడ్పీ ఉన్నత పాఠశాలలో సోమవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో అధికారులు పిలుపునిచ్చారు. నషా ముక్త్ భారత్ అభియాన్‌లో భాగంగా నార్కోటిక్ సెల్ విభాగం, ఈగల్ సిబ్బంది ఆధ్వర్యంలో స్కూలు విద్యార్థులకు అవగాహన కల్పించారు.

ఆర్టీసీ... గంటల తరబడి వేచిచూసి...



రాష్ట్రంలో మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం అంటూ హడావుడి చేసిన ప్రభుత్వం అది కొన్ని బస్సులకే అని తెలియడంతో మహిళా ప్రయాణికులు బస్సులకోసం గంటల తరబడి బస్టాండ్‌లో నిరీక్షణ చేయవలసి వస్తోంది. ఉచిత బస్సు దేవుడికెరుక కానీ ఉన్న బస్సులు వేళకు రాక మహిళా ప్రయాణికులు అవస్థలు పడుతున్నారు. ఈ దృశ్యాలు సోమవారం వైఎస్సార్ కడప జిల్లా కేంద్రమైన కడప ఆర్టీసీ బస్టాండ్‌లో కనిపించాయి.

- ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప







29న తెలుగు భాషాదినోత్సవ వేడుకలు

కడప ఎడ్యుకేషన్: కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ఏర్పాటై 75 వసంతాలను పూర్తి చేసుకుంది. ఈ నేపథ్యంలో ఈనెల 29న తెలుగు భాషా దినోత్సవ వేడుకలను కళాశాలలో నిర్వహించనున్నామని ప్రిన్సిపాల్ రవీంద్రనాథ్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18 నుండి 28 వ తేదీ వరకు కళాశాలలో సాంస్కృతిక అంశాల్లో విద్యార్థులకు పోటీలను నిర్వహించనున్నారు.

పద్య పఠనం: ఈ పోటీలు 8 నుండి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు నిర్వహించనున్నారు. భావంతో పని లేకుండా ఏవైనా 5 పద్యాలు పఠనం చేయాల్సి ఉంటుంది. ఇంటర్ నుండి డిగ్రీ విద్యార్థులకు వేమన, సుమతి శతకాలు, పోతన భాగవతం నుండి ఏవైనా 3 పద్యాలు భావంతో సహా రాయాల్సి ఉంటుంది. ఈ పోటీల్లో పాల్గొనదలచిన వారు కెఎస్ సుందరేశ్వరరావు 9491641228, హజరతయ్య 9502547993 నెంబర్ల ద్వారా సంప్రదించి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ఏక పాత్రాభినయం/ నాటక పద్యాలు పాడడం ...

8 నుండి డిగ్రీ విద్యార్థులకు ఉండనున్నాయి. ఈ పోటీలకు పాదిలి నాగరాజు 7989320752, ఎల్. రాజీవ్‌బాబు 7093055233 నెంబర్‌లను సంప్రందించి వారి పేర్లు నమోదు చేసుకోవాలన్నారు.

ముగ్గుల పోటీలు...

ఈ పోటీలు 8వ తరగతి నుండి 10 వ తరగతి చదువుతున్న విద్యార్థులకు, ఇంటర్ నుండి డిగ్రీ చదువుతున్న విద్యార్థులకు ఉండనున్నాయి. డా.పాదిలి నాగరాజును 7989320752, ఎల్. రాజీవ్‌బాబు 7093055233 నెంబర్‌లను సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు.

ప్రిన్సిపాల్‌పై చర్యలు తీసుకోవాలి

కడప ఎడ్యుకేషన్: పెండ్లిమర్రి మండల కేంద్రంలో ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ విద్యార్థులపై దాడి చేశారని ఆమెపై చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం కడప జిల్లా కేంద్రంలో ప్రజా సమస్యల పరిష్కార వేదికలో డీఆర్వో విశ్వేశ్వరనాయుడును కలసి ఈ మేరకు వారు వినతి పత్రం ఇచ్చారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.అంకన్న, పీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు కే. సుబ్బరాయుడు, ఏఐఎస్‌బీ జే.జయవర్ధన్, ఏఎస్ వైఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు ఓబయ్య తదితరులు పాల్గొన్నారు.

ఉత్సాహంగా ఉట్లోత్సవం

బద్వేలు అర్బన్ : స్థానిక నెల్లూరు రోడ్డులో గల శ్రీకృష్ణమందిరంలో కృష్ణాష్టమి సందర్భంగా మూడు రోజుల పాటు నిర్వహించిన వేడుకలు సోమవారంతో ముగిశాయి. చివరిరోజు నిర్వహించిన పూజా కార్యక్రమాల్లో బద్వేలు రూరల్ సీఐ ఎం. నాగభూషణ్, ఎస్ఐలు సత్యనారాయణ, శ్రీకాంత్, జగదీశ్వర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలో నిర్వహించిన ఉట్టికొట్టే కార్యక్రమాన్ని సీఐ ప్రారంభించారు. ఉట్టికొట్టే కార్యక్రమంలో యువకులు ఉత్సాహంగా పాల్గొనగా స్థానిక యాదవనగర్‌కు చెందిన పోలుబోయిన పవన్ విజేతగా నిలిచాడు. మధ్యాహ్నం భారీ అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం స్వామివారికి గ్రామోత్సవం నిర్వహించారు. గ్రామోత్సవం వెంట వందలాది మంది భక్తులు పాల్గొన్నారు. ప్రత్యేక పూజలు చేశారు. అలాగే గ్రామోత్సవంలో ఏర్పాటు చేసిన కోలాటం ఆకట్టుకుంది.

ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, శ్రీకృష్ణ జయంతోత్సవ కమిటీ సభ్యులు, నాయకులు వెంగల్‌రెడ్డి, మిత్తికాయల రమణ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రంలో మహిళలకు భద్రత కరువు

- ఆడబిడ్డలను ఆటబొమ్మలుగా చూస్తున్న ప్రభుత్వం
- వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ

కడప కార్పొరేషన్: కూటమి ప్రభుత్వం ఆడబిడ్డలను ఆటబొమ్మలుగా చూస్తోందని, అందుకే వారిపై జరిగే అత్యాచారాలు, అఘాయిత్యాలను ఏమాత్రం పట్టించుకోవడం లేదని వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ విమర్శించారు. సోమవారం జిల్లా పార్టీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ప్రభుత్వంలో భాగమైన అధికార పార్టీ ఎమ్మెల్యేలే మహిళలపై వేధింపులకు పాల్పడుతుంటే ఎవరికి చెప్పుకోవాలని ప్రశ్నించారు. శ్రీకాకుళం జిల్లా, ఆముదాల వలసలో కస్తూర్బా స్కూల్ ప్రిన్సిపల్‌పై ఎమ్మెల్యే కూన రవి కుమార్ లైంగిక వేధింపులకు పాల్పడటం దుర్మార్గమన్నారు. మరో ఎమ్మెల్యే ఆదిమూలం సొంత పార్టీ కార్యకర్తనే వేధిస్తే ఆమె ఆత్మహత్య ప్రయత్నం చేసిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో మహిళలకు, చిన్నారులకు రక్షణ లేకుండా పోయిందని, ప్రతిరోజూ ఎక్కడో ఒకచోట అఘాయిత్యాలు జరుగుతూనే ఉన్నాయన్నారు. వీటిపై ముఖ్యమంత్రిగానీ, హోం మంత్రిగానీ పట్టించుకున్న పాపాన పోలేదన్నారు. ఒక మహిళ హోంమంత్రిగా ఉన్న ఈ రాష్ట్రంలో మహిళలపై ఇన్ని అరాచకాలు, అఘాయిత్యాలు జరగడం సిగ్గుచేటన్నారు. మాజీ సీఎం వైఎస్ జగన్‌ను విమర్శించడానికే అనితకు హోంమంత్రి పదవి ఇచ్చినట్లుందే తప్పా రాష్ట్రంలో శాంతిభద్రతలు కాపాడటానికి కాదన్నారు. ఆపదలో ఉన్న మహిళలను రక్షించడానికి గత ప్రభుత్వం ప్రవేశపెట్టిన దిశయాప్‌ను నిర్వీర్యం చేశారన్నారు. మహిళా విభాగం రాష్ట్ర కార్యదర్శి క్రిష్ణవేణి మాట్లాడుతూ హోంమంత్రి అనిత రాష్ట్రంలోని మహిళల ధన, మాన, ప్రాణాలను రక్షించాలని, లేనిపక్షంలో రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. కో ఆప్షన్ సభ్యురాలు బి. మరియలు మాట్లాడుతూ ఎమ్మెల్యే కూన రవికుమార్‌కు అక్కాచెల్లెళ్లు లేరా...ఆయనకు బుద్ధి, జ్ఞానం ఉన్నాయా అని మండిపడ్డారు. టీడీపీ ఎమ్మెల్యేలు ఇన్ని దురాగతాలు చేస్తుంటే కూటమిలోని బీజేపీ, జనసేన ఎందుకు మౌనంగా ఉన్నాయని ప్రశ్నించారు. వాళ్లు వీటిని సమర్థిస్తున్నారా అని సూటిగా ప్రశ్నించారు. కూన రవికుమార్‌పై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని, లేనిపక్షంలో ఆందోళన తప్పదని హెచ్చరించారు. ఈ సమావేశంలో మహిళా నేతలు సుశీలమ్మ, భాగ్యమ్మ, శ్రీదేవి, మల్లీశ్వరి, పద్మ పాల్గొన్నారు.

మంజుమియ్యా పార్కులో మరమ్మతులు చేయాలి

కడప కార్పొరేషన్: కడప నగరం 30వ డివిజన్‌లో ఉన్న మంజుమియ్యా పార్కులో మరమ్మతులు చేయాలని ఆ డివిజన్ కార్పొరేటర్ ఎస్ఎండీ షఫీ కోరారు. సోమవారం కమిషనర్ మనోజ్‌రెడ్డికి ఆయన వినతి పత్రం సమర్పించారు. ఈ సందర్భంగా షఫీ మాట్లాడుతూ పార్కు శిథిలావస్థకు చేరిందని, పార్కులోని టైల్స్ అన్నీ దెబ్బతిన్నాయని, గతంలో నాటిన మొక్కలు చనిపోయాయన్నారు. ఎలుకల వల్లే టైల్స్, గోడలు దెబ్బతిన్నాయన్నారు. మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచాలన్నారు. తద్వారా సర్కిల్‌ను సుందరీకరించాలని కోరారు.

సిమెంట్ రోడ్డు వేయాలని వినతి..

శివానంద పురం ప్రధాన రోడ్డు సిమెంట్ రోడ్డుకు నోచుకోక, వర్షాలు పడిన ప్రతిసారి ఆ మార్గాన నడిచే ప్రజలు కష్టాలు పడుతున్నారని రాయలసీమ కమ్యూనిస్టు పార్టీ నగర కార్యదర్శివర్గ సభ్యులు ఎం. ప్రసాద్, విజయ్ కుమార్ కోరారు. సోమ వారం వారు కమిషనర్‌కు వినతి పత్రం సమర్పించారు. వెంటనే ఈ ప్రాంతంలోని ప్రధాన రహదారితో పాటు వీధి రోడ్లను సీసీ రోడ్లుగా వేయాలన్నారు.



కమిషనర్ మనోజ్‌రెడ్డికి వినతి పత్రం సమర్పిస్తున్న కార్పొరేటర్ షఫీ

ఎరువులు సకాలంలో అందించాలి

కడప కార్పొరేషన్: ఉమ్మడి వైయస్ఆర్ కడప జిల్లాకు ఖరీఫ్ సీజన్ కు సంబంధించి రైతులకు కావలసిన ఎరువులు సకాలంలో అందించాలని వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి రెడ్యం వెంకట సుబ్బారెడ్డి డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్‌ఓ విశ్వేశ్వర నాయుడుకు ఆయన రైతులతో కలిసి వినతి పత్రం అందించారు. రైతు సేవ కేంద్రాల ద్వారా ఎరువులు అందుబాటులో లేకపోవడం వల్ల రైతులు దూర ప్రాంతాలకు వెళ్లి ప్రైవేటు ఎరువుల దుకాణదారుల వద్ద ఎమ్మార్పీ ధరలకు మించి అధిక మొత్తంలో వెచ్చించి ఎరువులు కొనుగోలు చేసే పరిస్థితి స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఉమ్మడి వైఎస్ఆర్ కడప జిల్లాకు ఖరీఫ్ సీజన్‌లో మే నెల నుంచి సెప్టెంబర్ నెల వరకు 5 నెలల పాటు యూరియా 50,000 మెట్రిక్ టన్నులు, డీఏపి 16,500 మెట్రిక్ టన్నులు, యంఓపి 10,500 మెట్రిక్ టన్నులు, కాంప్లెక్స్ ఎరువులు 44,000 మెట్రిక్ టన్నులు.... మొత్తంగా 1,21,000 మెట్రిక్ టన్నులు ఎరువులు అవసరం కాగా ఇప్పటివరకు కేవలం 30,000 మెట్రిక్ టన్నులు కూడా అందుబాటులో లేవని చెప్పారు. ఉమ్మడి జిల్లాలో వరి, మొక్కజొన్న, వేరుశనగ, కంది, మినుము, పెసర , అరటి, బత్తాయి, మామిడి వంటి ఉద్యాన పంటలు కలిపి సుమారు 1,50,000 హెక్టార్లలో సాగు చేసే అవకాశాలు ఉన్నాయని, ప్రస్తుతం మంచి వర్షాలు కురవడంతో కేసీ కెనాల్, బ్రహ్మ సాగర్ ప్రాజెక్టు ద్వారా వేలాది ఎకరాలలో వరి తదితర పంటలు సాగు చేసే అవకాశాలు కనబడుతున్నాయన్నారు. ఈ నేపథ్యంలో రైతాంగానికి అవసరమైన యూరియా, డీఏపీ రైతు సేవా కేంద్రాలలో అందుబాటులో ఉంచాలన్నారు. డీఆర్‌ఓను కలిసిన వారిలో రైతు నాయకులు నాగేశ్వర్‌రెడ్డి, చంద్రశేఖర్‌రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, బి. సుబ్బరాయుడు యాదవ్, ఎస్. చిన్నారెడ్డి పాల్గొన్నారు.



డీఆర్‌ఓ విశ్వేశ్వర్‌నాయుడుతో మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి వెంకట సుబ్బారెడ్డి

చెత్త పన్ను వసూలుపై విచారణ జరపాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలో చెత్తపన్ను వసూలులో జరిగిన అవినీతి అక్రమాలపై ఉన్నత స్థాయి విచారణ నిర్వహించాలని వామపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం డీఆర్వో విశ్వేశ్వరనాయుడుకు వినతిపత్రాన్ని సమర్పించారు. ఫార్వర్డ్ బ్లాక్ రాష్ట్ర కార్యదర్శి జయవర్ధన్, రెవెల్యూషనరీ సోషలిస్టు పార్టీ రాష్ట్ర కార్యదర్శి సుబ్బరాయుడు, న్యూ డెమోక్రసీ జిల్లా నాయకులు అంకన్న ఈ సందర్భంగా మాట్లాడుతూ నార్త్‌జోన్ అడిషనల్ వర్కర్ చెత్త పన్ను వసూలు చేసి ఎవరికి ఇచ్చారో, అందులో శానిటరీ ఇన్‌స్పెక్టర్ నాగసుబ్బయ్య, ఎస్ఎస్ లక్ష్మినారాయణ పాత్రపై విచారణ ఎందుకు చేయలేదని ప్రశ్నించారు. నార్త్‌జోన్ అడిషనల్ వర్కర్ దళిత ఉద్యోగి కావడంతో అతన్ని మాత్రమే బలి పశువును చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. ఒక రిటైర్డ్ ఆప్కాస్ ఉద్యోగి చెత్త పన్ను వసూలు చేస్తున్నారంటూ ప్రచారంలో ఉన్నప్పటికీ ఆ అంశంపై విచారణ జరగలేదన్నారు. అక్కడి శానిటరీ సెక్రటరీ అందుకు బాధ్యులన్నారు. ఆయా అంశాలపై తక్షణమే విచారణ నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వివిధ పార్టీల నాయకులు సగిలి రాజేంద్రప్రసాద్, ఓబయ్య, బాబు తదితరులు పాల్గొన్నారు.



డీఆర్వోకు వినతిపత్రం సమర్పిస్తున్న వామపక్షాల నాయకులు

విద్యార్థి సంఘాలను నిషేధించడం దారుణం



అంబేడ్కర్ సర్కిల్‌లో ఆందోళన చేస్తున్న వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం నాయకులు

కడప కార్పొరేషన్: ప్రభుత్వ విద్యాసంస్థలు, వసతి గృహాల్లోకి విద్యార్థి సంఘ నాయకులు ప్రవేశించకుండా ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేయడం దుర్మార్గమని వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం జిల్లా అధ్యక్షుడు పి. సాయిదత్త అన్నారు. సోమవారం డా. బీఆర్ అంబేడ్కర్ కూడలిలో వైఎస్సార్‌సీపీ విద్యార్థి విభాగం ఆధ్వర్యంలో ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన పదిహేను నెలల్లోనే విద్యారంగాన్ని పూర్తిగా నీరుగార్చిందన్నారు. ప్రభుత్వ వైఫల్యాలు బహిర్గతం అవుతాయనే భయంతోనే విద్యార్థి సంఘాలని ప్రభుత్వ విద్యాసంస్థల్లోకి రాకుండా చీకటి ఉత్తర్వులిచ్చిందని మండిపడ్డారు. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు విద్యార్థి సంఘాలతో సమావేశాలు నిర్వహించిన మంత్రి లోకేష్ నేడు ఇలాంటి ఉత్తర్వులివ్వడం దారుణమన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకిచ్చిన బ్యాగులు నెల రోజుల్లోనే చిరిగిపోయాయని, మధ్యాహ్న భోజనం అత్యంత నాసిరకంగా ఉందని,ఆంగ్ల బోధన అటకెక్కిందన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ ఎస్సీ విభాగం జిల్లా అధ్యక్షులు సింగమాల వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌టీయూసీ జిల్లా అధ్యక్షులు మల్లూరి జాషువా, కడప నగర ఎస్సీ విభాగం అధ్యక్షులు కంచుపాటి బాబు, విద్యార్థి నాయకులు సందీప్‌రెడ్డి, జి. సాయికుమార్‌రెడ్డి, శ్యామ్, జబ్బార్, విష్ణు, హేమంత్, అనిల్, ప్రవీణ్, సునీల్ పాల్గొన్నారు.

విన్నపాలు వినవలే... ప్రజల కష్టాలు దేవుడికెరుక





జిల్లా కలెక్టర్ కార్యాలయానికి ప్రతి సోమవారం జిల్లా నలు మూలల నుంచి ప్రజలు తమ సమస్యలను విన్నవించేందుకు వస్తుంటారు. కూటమి ప్రభుత్వం వచ్చిన కొత్తలో ప్రజలకు షామియానా, టెంట్లు వేసేవారు. కాలక్రమేణా అవి తీసి వేశారు. తాగేందుకు చల్లని మంచి నీటి క్యాన్లు కూడా ఏర్పాటు చేశారు. కానీ ఇప్పుడు అవి ఎక్కడా కనిపించడం లేదు. కనీస వసతులు లేక కలెక్టరేట్‌కు వచ్చే ప్రజలు ఫుట్ పాత్ లపై నిరీక్షణ చేయవలసి వస్తోంది. దీంతోపాటు వాహనాలపై గోడలపై అర్జీలను రాస్తున్న దృశ్యాలు కనిపించాయి.

- ఫొటోలు: సాక్షిఫొటోగ్రాఫర్ , కడప

వైవీయూ అభివృద్ధికి నిధులు కేటాయించాలి



వైవీయూ నాయకులతో కలిసి కరపత్రాలను విడుదల చేస్తునన డీఎం ఓబులేసు

కడప ఎడ్యుకేషన్: యోగివేమన విశ్వ విద్యాలయ అభివృద్ధికి ప్రభుత్వం నిధులు కేటాయించాలని ఆర్ఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు డీఎం ఓబులేసు డిమాండ్ చేశారు. ప్రభుత్వం నిర్లక్ష్యం వల్లే వైవీయూ అభివృద్ధిలో వెనకంజలో ఉందని తెలిపారు. ప్రభుత్వం స్పందించి యోగి వేమన విశ్వవిద్యాలయ అభివృద్ధికి రూ.100 కోట్లు కేటాయించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం వైవీయు ఆర్ట్స్ బిల్డింగ్ వద్ద విద్యార్థులతో కలిసి కరపత్రాలు విడుదల చేశారు. ఆయన మాట్లాడుతూ వైవీయు ఏర్పాటు చేసి 20 సంవత్సరాలు అవుతున్నా ఇంకా అభివృద్ధిలో వెనుకబడి వుందన్నారు. పరిశోధనలు, బోధనల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతలు ఉన్నా వైవీయుకు నిధుల లేమి కారణంగా ప్రముఖ యూనివర్సిటీల స్థాయిలో నిలబడలేక పోతోందన్నారు. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు స్పందించి వైవీయూ అభివృద్ధికి నిధులు కేటాయించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆర్ఎస్ఎఫ్ యూనివర్సిటీ అధ్యక్షులు కే. నరసింహ, సభ్యులు మోహన్, పవన్ కుమార్ రెడ్డి, విజయ్, రజిత, విజయలక్ష్మి, సమీరా, మమత, అనూష, చంద్రిక, నర్మదా, మహమ్మద్ గౌస్ తదితరులు పాల్గొన్నారు.

హామీల అమలుకు కృషి చేయండి

కడప ఎడ్యుకేషన్: కూటమి ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను అమలు చేసేందుకు కృషి చేయాలని యూటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి బి.లక్ష్మి రాజా, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు మాదన విజయ కుమార్, పాలెం మహేష్ బాబు డిమాండ్ చేశారు. ఈ విషయమై సోమవారం పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ భూమిరెడ్డి రాంగోపాల్‌రెడ్డిని యూటీఎఫ్ నాయకులు పులివెందుల్లో కలిసి వినతిపత్రాన్ని అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉద్యోగులకు చెల్లించాల్సిన బకాయిలను పూర్తిస్థాయిలో చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీ అమలులో తీవ్ర జాప్యం జరుగుతోందన్నారు. నాలుగు డీఏలు పెండింగ్ లో ఉన్నప్పటికీ, రాష్ట్ర ప్రభుత్వం వాటిని ప్రకటించకపోవడం వల్ల ఉద్యోగ, ఉపాధ్యాయులు పెరిగిన ధరలతో ఇబ్బందులకు గురవుతున్నారన్నారు. కాంట్రిబ్యూటరీ పెన్షన్ విధానాన్ని రద్దు చేసి, మెరుగైన పెన్షన్ విధానాన్ని అమలు చేస్తామన్న పాలకులు ఆ వైపుగా ఆలోచనే చేయడం లేదన్నారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి చెరుకూరి శ్రీనివాసులు, జిల్లా కార్యవర్గ సభ్యులు ఏ.డి.దేవదత్తం, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాసులురెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సీపీఎం రాష్ట్ర కార్యదర్శిని అరెస్టు చేయడం దుర్మార్గం

కడప వైఎస్ఆర్ సర్కిల్: కార్పొరేట్ల కోసం బలవంతపు భూసేకరణకు వ్యతిరేకంగా కరేడు ప్రజలు చేస్తున్న 50వ రోజు నిరసనకు సంఘీభావంగా రైతులు, ప్రజా సంస్థలు ‘చలో కరేడు’ కార్యక్రమానికి పిలుపు నిచ్చాయని, ఈ పిలుపులో పాల్గొన్న సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి శ్రీనివాసరావును అరెస్టు చేయడం అక్రమమని సిపిఎం నగర కార్యదర్శి రామమోహన్ పేర్కొన్నారు. సోమవారం నగరంలోని సిపిఎం కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా ఉలవపాడు మండలం చలో కరేడు కార్యక్రమానికి వెళ్లే దానికి లేదని నాయకులను పోలీసులు కొంత మందిని హౌస్ అరెస్టు చేశారన్నారు. నిరసన చేస్తున్న నాయకులను, కార్యకర్తలను పోలీసులు ముందస్తు అరెస్టులు చేయడం సమంజసం కాదన్నారు. అరెస్టులతో ఉద్యమాన్ని ఆపలేరన్నారు.

పెన్నా పరీవాహక ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సిద్దవటం : మండలంలోని పెన్నానది పరీవాహక గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సిద్దవటం తహసీల్దారు తిరుమలబాబు తెలిపారు. ఈ సందర్భంగా తహసీల్దారు కార్యాలయంలో సోమవారం ఆయన మాట్లాడుతూ ఎగువ ప్రాంతాల్లో కురిసిన భారీ వర్షాలకు పెన్నానదిలో నీటి ప్రవాహం పెరుగుతోందన్నారు. మండలంలోని జ్యోతి గొల్లపల్లి, వంతాటిపల్లె, ఆకులవీధి, గాండ్లపాలెంతోపాటు మరికొన్ని గ్రామాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. ఏదైనా విపత్తు సంభవిస్తే సమాచారానికి 97048 98945, 80742 29387, 76749 50729లకు సమాచారం తెలపాలని తహసీల్దారు తెలియజేశారు.